# "ది కంప్లెయింట్"

—మల్లాది వెంకటకృష్ణమూర్తి

పద్మారావు, గురుమూర్తుల మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమంటుంది. ఒకరినిచూస్తే మరొకరు మండిపడతారు.

ఆ ఆఫీసులో వాళ్ళ కీచులాట మిగతా సహోద్యోగులకి టైంపాస్. సరదాకోసం ఇద్దరి మధ్యా ద్వేషభావం పెంపొందించారు కొందరు నారదమునీంద్రులు.

పద్మారావు వయసు పాతిక. ఆ ఆఫీసులో యు. డి. సి. గా చేరి సంవత్సరం అయినా పూర్తికాలేదు. కాలేజీ నుంచి కొత్తగా వచ్చాడు, సాగర్‌లో ఎం. ఏ. లిటరేచర్ పూర్తిచేసి. యువక రక్తం కాబట్టి, అభిమానవంతుడు కాబట్టి తనమీద ఈగ వాలనివ్వడు.

గురుమూర్తి వయసు ఏభై రెండు. కొద్ది సంవత్సరాల్లో రిటైరవబోయే ఆయన సూపరింటెండెంట్. ఆయన సెక్షన్‌లోనే పనిచేస్తున్నాడు పద్మారావు. గురుమూర్తికి కూడా స్వతహాగా కోపం అధికం. కాని ఆయన, పద్మారావులా నోటితో చూపకుండా, నోట్లమీద, మెమోలమీద చూపుతాడు అఫీషియల్‌గా.

ఇద్దరికి పడకపోవటానికి కారణాలు చిన్నవే. ఎవరికి ఎవరూ ద్రోహం చేయలేదు. ఒకరి ఆస్తి ఒకరు కాజేయలేదు. ఒకరి సొమ్ము మరొకరు తినలేదు.

చాలా చిన్న కారణాలు.

కాని అనేక అలాటి చిన్న కారణాలన్నీ ఇద్దరినీ ఒకరికొకరు శత్రువులుగా మార్చాయి.

పద్మారావు డ్రాఫ్ట్ రాస్తాడు. గురుమూర్తి దగ్గర కెళ్తుందా డ్రాఫ్ట్ ఫైల్‌తోపాటుగా. దాన్ని ఆయన పూర్తిగా కొట్టేసి, విశాలమైన మార్జిన్‌లో మళ్ళీ అదే సారాంశం తనకి నచ్చిన రీతిలో వ్రాస్తాడు.

పద్మారావు ఇది సహించలేడు.

''నే వ్రాసిన దాంట్లో ఏం తప్పుంది చూపించండి?'' అంటూ లేస్తాడు.

''ఇంగ్లీష్ ఎం. ఏ. చదివితే చదివుండొచ్చు. కాని నా ఎఫ్. ఏ. తో, నా సర్వీస్‌తో సమానం కాదు. ఇదీ డ్రాఫ్ట్ వ్రాయాల్సిన విధానం'' అంటాడు గురుమూర్తి ఆ మార్జిన్ చూపించి.

''నే రాసిందే తిరగరాసారు. కొత్తగా అక్షరం ముక్క కూడా చేర్చలేదు. ఇంకాస్త సంక్షిప్తంగా వ్రాశారంతే. నే వ్రాసింది అలా వుంచితే దేశం మునిగి పోదుగా''

''డ్రాఫ్ట్ వ్రాయడానికి కొన్ని నిబంధనలున్నాయి''

''యు ఆర్ రిక్వెస్టెడ్ టూ' అని నే వ్రాస్తే 'యు ఆర్ రిక్వైర్డ్ టూ' అని మీరు వ్రాశారు. ఇదా కరెక్షన్ అంటే? అసలు మీకీ కరెక్షన్ అన్న పదానికి అర్థం తెలియదు''

లేకపోతే...

''నిన్న ఆఫీసుకు రాలేదు. ఇరవై నాలుగు గంటల్లో శెలవు చీటీ పంపాలి ఆఫీస్‌కి. ముందు అనుమతి తీసుకోకుండా ఇప్పుడిస్తే ఎలా?''

''ఇరవై నాలుగు గంటల్లో ఇస్తే సరిపోయేదా?

''అవును''

''ఇరవై నాలుగుగంటల్లో ఇవ్వకపోతే దేశం మునిగిపోతుందా? మూడు మైళ్ళు ఎండనపడి సైకిల్ మీద

రావాలా మీకీ కౌగిలం ముక్క ఇవ్వడానికి?"

ఇలా అనేక కారణాలవల్ల ఇద్దరి మధ్యా అగ్ని రాజుకుంది. పద్మారావు ఇలాంటి చిన్నచిన్న రూల్స్- గవర్నమెంట్ ఆఫీసుల్లో ఏనాటి నుంచో వస్తున్న రూల్స్, పట్టించుకోడు, వాటివల్ల ఎవరికీ ఒరిగేది ఏం లేదని.

కాని గురుమూర్తి రక్తకణాల్లో రక్తం లేదు. బదులుగా ఇలాంటి రూల్స్ వున్నాయి. వాటిని యధాతధంగా అమలు పరచాలి అన్నదే ఆయన ధ్యేయం.

యతి అంటే ప్రతి అనే పద్మారావంటే ఆయనకి మండుకొస్తుంది.

ఫలితంగా మెమోల మీద మెమోలు ఇస్తుంటాడు. పద్మారావు వాటిని ఖాతరు చేయడు.

పద్మారావు తరఫువాళ్ళు చెప్పారు అతనికి 'నీ పరోక్షంలో నిన్ను 'పద్మ'గా సంబోధిస్తున్నాడు. ఆడ పేరుకి పక్కన రావు తగిల్చుకొన్నావుట. నీ పన్నీ ఆడలక్షణాలేట. నీవు దద్దమ్మవిట."

పద్మారావు బదులు తీర్చుకొన్నాడు.

గురుమూర్తి తరఫువాళ్ళు చెప్పారు ఆయనకి.

"మీ పరోక్షంలో మిమ్మల్ని 'జిగురుమూర్తి'గా సంబోధిస్తున్నాడు పద్మారావు, మీ ఇ న్ షి య ల్ ప్రక్కన చుక్క తీసేసి. మీరు జి. గురుమూర్తి కాదట. వట్టి జిగురుమూర్తట. మీవన్నీ జిగురు లక్షణాలట. ఒద్దమ్మటకూడా."

ఆ ఆఫీసులోని హెడ్ ఆఫ్ ది ఆఫీస్ కూడా కొద్దిగా సెన్స్ ఆఫ్ హ్యూమర్ వుంది.

తరచు ఆఫీసులోని వుద్యోగులు బయట వూళ్ళకి టూర్ వెళ్తుండాల్సివస్తుంది.

జిగురుమూర్తిని, పద్మారావుని, ఇంకో యు.డి.సి.ని కలిపి విజయవాడకి టూర్ ఏర్పాటు చేసాడాయన. పదిహేను రోజులు ఇద్దరూ కలిసి పి. డబ్ల్యు. డి. గెస్ట్ హౌస్‌లో వుండాలి. విజయవాడ బ్రాంచ్ ఆఫీసులో కలసి పనిచేయాలి.

ఆ ప్రోగ్రాం సంగతి తెలియగానే ఆఫీస్‌లో అది 'బర్నింగ్ టాపిక్' అయింది. ఆ రోజంతా వుద్యోగులు తమ పనులు మానేసి ఈ విషయమే ముచ్చటించసాగారు.

కొంత మంది ఆఫీసర్ గదిలోకి వెళ్ళి అభినందించారు ఆయన తెలివికి.

"వాడితోనా? వాడికసలు పనేం చేతవును ?" ఎగిరి పడ్డాడు జి. గురుమూర్తి, పద్మారావుతో తను టూర్ వెళ్ళాలని తెలిసి

"ముసలాడితోనా? భలేమజా. రూల్స్ వెతుక్కోనటం, మెమోలు తయారు చేయటం ఒకటే తెలుసు" అన్నాడు పద్మారావు.

జి. గురుమూర్తి పద్మారావు బదులు ఇంకెవరినయినా పంపమని హెడ్ ఆఫ్ది ఆఫీస్‌కి విన్నవించుకున్నాడు.

"నో నో మిష్టర్ గురుమూర్తి. నా వుద్దేశంలో అసలతనికి పనే చేతకాదు. మరి ట్రయినింగ్ ఇచ్చి నేర్పాలి. ఇన్‌స్పెక్షన్‌కి వెళ్ళినపుడు మీ లాంటి వాళ్ళతో పంపితే కొంత పని పట్టుపడుతుంది" అన్నాడాయన.

పద్మారావు ఆయన గదిలోకి వెళ్ళాడు.

"ఈ సారికి వెళ్ళి రండి. అంతగా నచ్చకపోతే ఇంకోసారి పంపను" అన్నాడు.

ఇద్దరూ ముందర శెలవు పెడదా మనుకున్నారు, ఎవరికి వాళ్ళు. కాని భయపడి శెలవు పెట్టామని అంతా అనుకొంటారని ఆ ప్రయత్నం మానుకున్నారు.

టూర్ ఎడ్వాన్స్ తీసుకుని రైలు టిక్కెట్లు రిజర్వ్ చేసుకున్నారు.

జి. గురుమూర్తికి ఫస్ట్ క్లాస్ ఎలిజిబిలిటీ వుంటే, పద్మారావుకి సెకండ్ క్లాస్‌లో ప్రయాణం చేసే అర్హతే వుంది.

మునిసిపల్ గెస్ట్ హౌస్‌లో దిగారు ముగ్గురూ విజయవాడ చేరుకుని.

"రాముడు, రావణుడు కలసి వచ్చారు" అనుకున్నారు విజయవాడ బ్రాంచ్ లోని వుద్యోగులు. పద్మారావు జి. గురుమూర్తిల తరహాకి చాటున నవ్వుకొన్నారు.

ఓ డ్రాఫ్ట్ వ్రాసిన ఫైల్ విసిరికొట్టి కోపంగా అరిచాడు. జి. గురుమూర్తి విజయవాడ ఆఫీసులో.

''అయామ్ ఫెడప్. ఇద్దరిలో ఎవరో ఒకరు రిజైన్ చేయాలి.

''ఇద్దరిలో ఎవరో ఒకరు రిటైర్ అవాలి. అయామ్ ఫెడప్టూ'' అన్నాడు పద్మారావు.

పద్మారావు వ్రాసిన కాగితం పర పరచింపేసి మళ్ళీ తను వ్రాసుకోసాగాడు జి. గురుమూర్తి.

"గుడ్ ఫ్రైడే, సెకండ్ సాటర్ డే, సన్‌డే వరసగా మూడు రోజులు శెలవ లొచ్చాయి. నేను మద్రాస్ వెళ్తున్నాను గురువారం రాత్రి బయలుదేరి. మళ్ళీ సోమవారం ఉదయం వస్తాను" చెప్పాడు పద్మారావు

"దేనికీ ?"

''మద్రాస్‌లో మా పిన్నమ్మ వుంది, ఇంతదూరం వచ్చాక ఆవిడని చూద్దామని వుంది. ఓవర్ నైట్ జర్నీ కాబట్టి వెళ్లొస్తాను. అఫ్‌కోర్స్. గెస్ట్‌హౌస్ ఛార్జీలు కడతాను. ఈ మూడు రోజులూ నే లేనని అవి మొత్తం మిమ్మల్నే భరించమనను.''

''అలా అయితే ఆ మూడు రోజులూ మీకు డి. ఏ రాదు''.

"ఏం ?"

''పగలు ఎక్కడ తిరిగినా రాత్రి కేంప్‌కి తిరిగి రావాలి".

''ఎందుకో ?

''రూల్స్ అలా వున్నాయి''

''వచ్చి ?''

"......''

"వచ్చి ? ఏం చేయాలి ?"

''పడుకోవాలి'' చిరాకుగా అన్నాడు గురుమూర్తి.

''ఆఫీస్ పని చేయక్కరలేదుగా ?"

అవసరం లేదు"

''అలాంటప్పుడు ఎక్కడ పడుకుంటే ఏం ? విజయవాడలో పడుకొన్నా, మద్రాస్‌లో పడుకొన్నా ఒకటేగా. ఆఫీసుకి నష్టం లేదుగా"

''టి. ఏ రూల్స్‌లో స్పష్టంగా వుంది రాత్రి కేంప్‌లోనే గడపాలని"

''మంచిది. వుండనివ్వండి. నేను త్రీటయర్ స్లీపర్ చేసేసుకొన్నాను నిన్న. సాయంకాలమే వెళ్తున్నా."

''అయితే ఆ మూడు రోజులు డి. ఎ క్లెయిమ్ చేయకూడదు"

''చేస్తాను"

"తప్పది"

"రైటది"

''బడ్జెట్ ఫైల్ చూడండి" విసుగ్గా అన్నాడు జి. గురుమూర్తి.

"చూసేసాను. ఏం లేదందులో''

పద్మారావు మద్రాస్ వెళ్ళాడు గురువారం రాత్రి బయలుదేరి. సోమవారం వుదయం వచ్చేసాడు చెప్పినట్లుగానే, వుదయం ఆఫీస్ టైం లోపల.

"కావాలంటే విశ్రాంతి తీసుకోండి. నిద్ర పట్టి వుండదు రాత్రి రైల్లో'' అన్నాడు గురుమూర్తి వ్యంగ్యంగా.

"త్రీ టైర్ రిజర్వ్ చేయించుకొన్నాను. నిద్ర పట్టింది" చెప్పాడు పద్మారావు ఆవులించి. గురుమూర్తి పద్మారావుల మధ్య పోట్లాటని విని యధాతథంగా తన జ్ఞాపకాల్లో ఫైల్ చేసుకుంటున్నాడు, వాళ్ళవెంట వచ్చిన మూడో వుద్యోగి. ఇద్దరి మధ్యా జరిగిందంతా తిరిగి హైద్రాబాద్ వెళ్ళాక తన కొలీగ్స్‌కి వివరంగా చెప్పాలి అతను. అందుకు సమర్థుడైన అతన్ని శాస్త్ర వానికి వాళ్ళిద్దరి వెంట పంపడానికి కారణం అదే.

తిరిగి హైద్రాబాద్ చేరుకొన్నారు. వాళ్ల ముగ్గురూ విజయవాడలో కేంప్‌లో వుండగా హైద్రాబాద్ ఆఫీసులో వాళ్ళ గురించే చర్చ.

తిరిగి హైద్రాబాద్ చేరుకోగానే ఆఫీసులో పని సాగలేదు రెండు రోజులు. ఎవరి తరపువారు వారి వైపుచేరి వివరాలు ఆసక్తిగా విన్నారు.

అసలు కథ ఇక్కడ ప్రారంభం అవుతుంది.

టి. ఏ. బిల్ వ్రాసి కౌంటర్ సిగ్నేచర్‌కి సూపరింటెండెంట్ జి. గురుమూర్తికి ఇచ్చాడు పద్మారావు.

"ఈ మూడు రోజులూ మీకు డి. ఏ. రాదు రాత్రిళ్ళు కేంప్‌లో లేరు కాబట్టి"

''ఉన్నాను. గెస్ట్‌హౌస్‌కి రాలేదు. విజయవాడలో గాంధీనగరంలోని ఓ పిన్నమ్మ ఇంట్లో వున్నాను.

"మద్రాస్ వెళ్ళారు. అబద్ధం"

''నిరూపించగలరా? రూల్ ప్రకారం నే పోకూడదుగా" నవ్వాడు పద్మారావు

పళ్ళు కొరికాడు. సంతకం పెట్టాడు జి గురుమూర్తి ఆ బిల్ మీద.

బిల్ పాసయింది.

జి గురుమూర్తి ఆ బిల్ పాస్ అయేదాకా వూరుకున్నాడు. ఎవ్వాన్ను పోసు వరపై రూపాయల దాకా పద్మారావుకి వచ్చింది

ఆ డబ్బు తీసుకోగానే పద్మారావు మూడు రోజులు కేంప్‌లో లేకుండా డి. ఏ. తప్పుగా క్లెయిమ్ చేసాడని ఫిర్యాదు చేసాడు పై ఆఫీసర్‌కి. గురువారం రాత్రి మద్రాస్ వెళ్ళే బండిలో త్రీటయర్ కంపార్ట్‌మెంట్‌లో రిజర్వ్ చేసుకుని వెళ్ళాడని, మళ్ళీ ఆదివారం రాత్రి మద్రాస్ నుంచి త్రీటయర్ కంపార్ట్ మెంట్‌లో రిజర్వ్ చేసుకుని వచ్చాడని, కాబట్టి ఆ సంగతి రైల్వే వాళ్ళకి రాసి రూఢి చేసుకుని తగిన చర్య తీసుకోవల్సిందనీ పద్మారావు మీద ఫిర్యాదు వ్రాసిచ్చాడు జి. గురుమూర్తి తన పై ఆఫీసర్‌కి.

పద్మారావుకి మెమో ఇచ్చారు దానికి సమాధానం ఇవ్వమని.

తను మద్రాస్ వెళ్ళటం అబద్ధం అనీ, వెళ్లిందే జి. గురుమూర్తే వెళ్ళి వుండవచ్చనీ కేంప్‌లో ఆయనే లేడనీ బదులు ఇచ్చాడు పద్మారావు.

తనే స్వయంగా రైల్వే వాళ్ళకి వుత్తరం డ్రాఫ్ట్ చేసాడు గురుమూర్తి ఫలానా రోజుల్లో బి. పద్మారావు అనే వ్యక్తి త్రీ టయిర్‌లో రిజర్వ్ చేసుకుని విజయవాడ నుంచి మద్రాస్‌కి, తిరిగి విజయవాడకి ప్రయాణం చేసాడో లేదో తెలియ చేయమని. ఆఫీసర్ 'జి. గురుమూర్తి' పేరు కూడా చేర్చాడు పద్మారావు ఫిర్యాదు పురస్కరించుకొని.

నెల తర్వాత రైల్వే వాళ్ళ నుంచి వుత్తరం వచ్చింది. పద్మారావు అనే వ్యక్తి ప్రయాణం చేయలేదు !

'జి. గురుమూర్తి' అనే వ్యక్తి ఆతేదీలల్లో ప్రయాణం చేసాడు !!

"నేనా ?" అదిరి పడ్డాడు జి. గురుమూర్తి.

"వై నాట్ ?'' నవ్వాడు పద్మారావు.

తప్పుగా డి. ఏ. క్లెయిమ్ చేసిన నేరానికి వెంటనే జి. గురుమూర్తిని సస్పెండ్ చేయటం జరిగింది. ఎంక్వయిరీ ప్రారంభం అయింది.

పద్మారావు హాయిగా వూపిరి పీల్చుకున్నాడు తన డ్రాఫ్ట్‌లని కరెక్ట్ చేసే వ్యక్తి ఆఫీసులో ఇంకెవరు లేనందువల్ల.

''నిజంగా జి.గురుమూర్తి మద్రాస్ వెళ్ళాడా ?'' అడిగారు కొందరు నమ్మకస్థులయిన స్నేహితులు పద్మారావుని.

''ఊహూ''

''మరి''

''నేనే వెళ్ళాను''

''జిగురుమూర్తి పేరుందే ఆ రోజు ప్రయాణం చేసినవారి జాబితాలో ?"

"ఆ ముసలినక్క తత్వం తెలుసు కాబట్టి ముందు జాగ్రత్త కోసం ఆయన పేరు మీద కొన్నాను టిక్కెట్లు. రిజర్వేషను ఫారంలోకూడా నా చేతి వ్రాత లేకుండా జాగ్రత్త పడ్డాను. ఆయన నా మీద ఎలాగూ కంప్లయింట్ చేస్తాడని తెలుసునాకు. కాబట్టి లిస్టులో నా పేరు బదులు ఆయన పేరుంది. ఎవరు దద్దమ్మో మీరే తేల్చండి" అన్నాడు పద్మారావు నవ్వి. *